క్లుప్తంగా

ఇల్లు కోల్పోయిన బాధితురాలికి ఎమ్మెల్యే సాయం

కేసరపల్లి(గన్నవరం): ఇల్లు కోల్పోయిన బాధితురాలికి ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు ఆంజనేయ వరప్రసాద్ చేతుల మీదుగా బాధితురాలికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామానికి చెందిన కొడవలి పాప ఇల్లు కూలిపోయి నిరాశ్రయురాలైందని, ఆమె పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి తన వంతు సాయం చేసినట్లు తెలిపారు.

ఓటర్ల తొలగింపు వివరాలను సేకరించాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత ఏడాది జనవరి 6వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఓటర్ల జాబితాలో నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను వెంటనే సేకరించి తెలియజేయాలని విజయవాడ రూరల్ మండల తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి వీఆర్వోలను ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. నున్న, పాతపాడు, అంబాపురం, జక్కంపూడి, గొల్లపూడి గ్రామాల మీదుగా వెడుతున్న నేషనల్ హైవే కారణంగా హైటెన్షన్ విద్యుత్ లైన్ల సర్వే నంబర్లతో రైతుల వివరాలను తెలియజేయాలన్నారు. ఆయా రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి గాను వివరాల అవసరం ఉందన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దారు ఎండీ సలీమ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు యువత కృషి చేయాలి



పెనమలూరు: లక్ష్యసాధనకు యువత కృషి చేసి ఫలితాలు సాధించాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఆక్టోపస్) సిద్ధార్థ కౌశల్ అన్నారు. మండలంలోని కానూరులో మంగళవారం నారాయణ ఐఏఎస్ అకాడమీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు లక్ష్యం సాధించటానికి తెలివితేటలే కాకుండా కృషి, పట్టుదల, ఆత్మస్థైర్యం కూడా ఉండాలన్నారు. యుపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఏకాగ్రత, లక్ష్యసాధన ఉండాలన్నారు. యూపీఎస్సీ పరీక్షకు సన్నద్ధం అవుతున్న వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కోలవెన్నులో కంటి వెలుగుకు విశేష స్పందన



కంకిపాడు: అందరికీ వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్ కుమార్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 160 మంది వృద్ధులకు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సరళ, ఆరోగ్య కార్యదర్శి పద్మావతి, ఆశ కార్యకర్తలు రజని, మెర్సీ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బుద్ధిజంలో డాక్టరేట్ సాధించిన జంక్షన్ యువకుడు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన తాడి ప్రశాంత్ బుద్ధిజంలో డాక్టరేట్ సాధించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన 40వ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ చేతుల మీదుగా ప్రశాంత్ పీహెచ్‌డీ పట్టాను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌తో పాటు అతని తల్లిదండ్రులు తాడి రంగారావు, శ్రీదేవిలను పలువురు అభినందించారు.

క్రీడాకారులకు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన పలువురు క్రీడాకారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు వరుణ్ కృష్ణగౌతమ్, పలువురు స్కేటింగ్ క్రీడాకారులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గుర్రం ఏడుకొండలు, కార్యదర్శి కొండాయ గుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, మురళికిష్ణ, బచ్చు మాధవి, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

దేశ భాషల్లో తెలుగుకు అత్యంత ప్రాధాన్యం



ఉయ్యూరులో తెలుగు అక్షరాలతో తెలుగుతల్లి వేషధారణలో చిన్నారులు

పెనమలూరు: దేశభాషల్లో తెలుగు భాషకు ఉన్న ప్రాధాన్యం మరే భాషకూ లేదని పీబీ సిద్ధార్థ కాలేజీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్ అన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఉద్యోగాలకు నిర్వహించే పరీక్షలు కూడా తెలుగులో నిర్వహించనున్నారని తెలిపారు. విద్యార్థులు ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువరాదన్నారు. అనంతరం శివకుమార్‌ను పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరంకిలో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

తెలుగు భాషా పితామహుడు ప్రముఖ కవి గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషపై సామెతలు, కథలు, మహనీయుల చరిత్రపై వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యా దాత కిలారు శివకుమార్ రూ.10 వేలు విలువ చేసే తెలుగు పుస్తకాలు బహుమతులుగా అందజేశారు. అనంతరం ఏడవ తరగతి విద్యార్థిని సీహెచ్ హేమశ్రీ కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మలినేని సుమలత, విద్యావేత్త కిలారు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అజరామరమైనది తెలుగు భాష

గన్నవరంరూరల్: దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించారని, ప్రతి ఒక్కరూ తెలుగు భాష పట్ల మమకారం కలిగి ఉండాలని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం వ్యవహారిక భాషా ఉద్యమ నేత గిడుగు రామ్మూర్తి 160వ జయంతి ఉత్సవం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా కీర్తింపబడిన తెలుగు భాష ప్రపంచంలో గొప్పగా వెలగాలని ఆకాంక్షించారు. తెలుగు పండితులు దామోదర గణపతిరావు, గుర్రం రాజబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.లక్ష్మణరావు, కేవీ రామారావు, శ్రీపతి రాంగోపాల్, మణిరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదే సభలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘనంగా నివాళులర్పించారు.

గొల్లనపల్లిలో...

గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం హెచ్‌ఎం కేఎస్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రీడల ప్రోత్సాహకులకు సత్కారం చేశారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఉయ్యూరు: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ ఉయ్యూరులో విద్యార్థుల ప్రదర్శన అబ్బురపరిచింది. తెలుగు అక్షరాలతో సంప్రదాయ వస్త్రధారణతో తెలుగు తల్లి వేషధారణతో దేశ భాషలందు తెలుగు లెస్స అని నినదించారు. ఉయ్యూరు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తెలుగు అక్షరమాలతో ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు పర్యవేక్షించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు, శ్రీనివాసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ ప్రదర్శన చేపట్టారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శంకర్ గుప్తా, విద్యాసంస్థల అధినేత పరుచూరి శ్రీనివాసరావు, ప్రతినిధులు ఎండీ ఇస్మాయిల్, నూకల వెంకట సాంబశివరావు, సీహెచ్ కుటుంబరాజు తదితరులు పాల్గొన్నారు. ఆర్డీఓ కార్యాలయం, ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది.

పెద్దబాలశిక్ష 'గాజుల' కు ఘన సన్మానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ×పెద్దబాలశిక్ష¶ పుస్తక సంకలనకర్త గాజుల సత్యనారాయణ దంతులను ఘనంగా సత్కరించారు. ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న ఆయన తెలుగు భాషలో దాదాపు 100కు పైగా పుస్తకాలను రచించారని వక్తలు కొనియాడారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగు భాషా పండితురాలు, నేత్రావధాని డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి అధ్యక్షత వహించారు. మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, బాపులపాడు, అప్పనవీడు జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, తోట పుష్పవతి, విశ్రాంత ఎంఈవో గంటా సత్యనారాయణ, మానవత సీనియర్ సభ్యులు నారగాని కొండలరావు, జన్యావుల సత్యనారాయణ, వడ్డీ రాజేశ్వరరావు, పొట్లూరి శేషాచలం, వేగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కంకిపాడులో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కంకిపాడు: తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. గొడవర్రు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం తోట సాంబశివరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈడుపుగల్లు శ్రీ విద్యాలయ పాఠశాలలో సంఘసంస్కర్తలు, కవులు, రచయితల వేషధారణలో చిన్నారులు ఇచ్చిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండలంలోని మంతెన జెడ్పీ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యావేత్త పెండ్యాల రామారావు పాఠశాల విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.10 వేలు ఆర్థిక వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నకుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఈ.రామలక్ష్మి పాల్గొన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.



పోరంకి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన దాత కిలారు శివకుమార్



కానూరు కేసీపీ సిద్ధార్థలో అధ్యాపకుడు శివకుమార్‌ను సన్మానిస్తున్న పాఠశాల కన్వీనర్ శశికళ



జంక్షన్‌లో గాజుల సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న మానవత సభ్యులు

అమృతతుల్యం తెలుగు భాష

గన్నవరం: అమృతతుల్యమైన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఉందని తెలుగు పండితుడు టి.రమణమూర్తి అన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కథలు, సామెతలు, నాటికల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మూర్తి మాట్లాడుతూ మాతృ భాష, సంస్కృతిని ఆచరిస్తూ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, అధ్యాపకులు వినీలాకృష్ణ, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు. స్థానిక కొత్తపేటలోని శ్రీచైతన్య స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్, డ్యాన్స్, పాటలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ గాయత్రిదేవి, డీన్ పి.శ్రీను, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి నిరీక్షణకు మోక్షం

ఎమ్మెల్యే వంశీ చొరవతో ఇళ్లపట్టాలకు గ్రీన్ సిగ్నల్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మూడవ వార్డులో వాడుకలో లేని చెరువు స్థలంలో నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇళ్ల పట్టాలను ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని నున్న గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. మంగళవారం గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గ్రామ పంచాయతీ సమావేశం జరిగింది. జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఉత్తరం ఆర్‌ఎస్ నంబరు 537లో సుమారు 50 సంవత్సరాలుగా 300 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వారు అనేక దఫాలు ఇళ్ల పట్టాలకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఇటీవల ఒక కార్యక్రమానికి నున్న గ్రామం వచ్చిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను స్థానికులు కలిసి తమకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయించాలని విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులతో మాట్లాడి 537 సర్వే నంబరులో ఉంటున్న కుటుంబాలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై విజయవాడ రూరల్ మండల రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఇళ్లపట్టాలను మంజూరు చేయడానికి స్థానిక గ్రామ పంచాయతీ ఎన్‌ఓసీ కోరారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం గ్రామంలో రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి సాంకేతిక అనుమతులు లభించినట్లు గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ తెలియజేశారు. పిమ్మట 9వ వార్డు ఉప ఎన్నికలో గెలుపొందిన వల్లూరు వెంకటశివతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మనందరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో పంట సాగు చేయటంతో పాటుగా ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రాజెక్టు అధికారి బి.వెంకటరామయ్య చెప్పారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. విత్తనం నాటు మొదలు మళ్లీ విత్తనం తయారయ్యే వరకు అనుసరించాల్సిన పద్ధతులపై రైతులు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగంతో రైతులకు పెట్టుబడి వ్యయం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వినియోగించి కషాయాల తయారీ, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా లాభదాయకమైన దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం భూపతిరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం ఎన్‌ఎఫ్‌ఏలు శ్రీనివాస్, గంగరాజు, సాయినాథ్ రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్తతో కలిసి అత్త, ఆడపడుచు, మరిది మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఓ మహిళ మంగళవారం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. వాంబే కాలనీ జీ బ్లాక్‌లో నివసించే దాసరి వీరాంజనేయులుకు దాసరి సౌజన్యతో 2018లో వివాహమైంది. అప్పటి నుంచి భార్యపై అనుమానంతో వీరాంజనేయులు రోజూ మద్యం తాగొచ్చి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. కట్నం చాల్లేదని, వేరే పెళ్లి చేసుకొంటానని బెదిరించేవాడు. భర్తతో పాటు అత్త, ఆడపడుచు, మరిది కూడా వేధిస్తుండటంతో సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని పాళ్ల బజార్, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయిబాబా ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయం గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

దళితులపై దాడి చేసిన టీడీపీ నేతలను అరెస్ట్ చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో బాపులపాడు రంగన్నగూడెంలో దళితులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన టీడీపీ నేతలను తక్షణమే అరెస్ట్ చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మెండెం రాంబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఐనంపూడి ఆశీర్వాదం డిమాండ్ చేశారు. రంగన్నగూడెంలోని బాధిత దళితులు తలారి ఈశ్వరరావు, వినయ్ రత్నం, గుర్నాథ్‌లను మంగళవారం వారు పరామర్శించారు. ఈ ఘటనపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితులను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవటాన్ని తప్పుబట్టారు. వచ్చే నెల 2వ తేదీలోపు దాడికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేయని పక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చొటపల్లి జేమి, గొన్నూరు సీమయ్య, తలారి జేమ్స్, మద్దాల కిన్ను, చంద్రశేఖర్, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

అదృశ్యమైన చిన్నారి క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు...



కంకిపాడు: అదృశ్యమైన చిన్నారి క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరింది. కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన ప్రాద్దుటూరి లక్ష్మి, వరదరాజులు దంపతులకు నిర్మల్‌కుమార్(9), దామిని(7) సంతానం. స్థానికంగా ఉన్న ఎంపీపీ పాఠశాలలో దామిని రెండవ తరగతి చదువుతోంది. ఈ నెల 28న అన్నయ్య నిర్మల్‌కుమార్‌తో కలిసి పాఠశాలకు బయలుదేరి వెళ్లిన దామిని మార్గమధ్యంలో ఆరోగ్యం బాగోలేదని ఇంటికి వెళ్లిపోయింది. అదే రోజు సాయంత్రం ఇంటికి కొడుకు నిర్మల్‌కుమార్ ఒక్కడే రావడంతో కుమార్తె గురించి తల్లి లక్ష్మి ఆరా తీసింది. ఆరోగ్యం బాగోలేదని పాఠశాలకు రాలేదని కుమారుడు చెప్పాడు. అర్ధరాత్రి వరకు కుమార్తె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో కంకిపాడు పోలీసులు అప్రమత్తమై వేల్పూరు గ్రామంలో జల్లెడ పట్టారు. నిర్మల్‌కుమార్ ద్వారా బాలిక సంచరించే ప్రాంతాల సమాచారం సేకరించి ఆయా ప్రాంతాల్లో అన్వేషణ సాగించారు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో వేల్పూరు శివారు లక్ష్మీపురం వంతెన సమీపంలోని ముళ్లపొదల్లో దాక్కుని ఉన్న దామిని పోలీసులకు కనిపించింది. దీంతో చిన్నారిని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కానూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు



ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌కు అవార్డు అందజేస్తున్న కలెక్టర్, డీఈవో

పెనమలూరు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. కానూరులో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉదయం 6 గంటలకు క్రీడా జ్యోతి వెలిగించి 2కే వాక్ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మదర్ థెరిసా పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. తొలుత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ ఫొటోకు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఈడా రాజేష్, సీపీఓ పి.నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాళ్లూరి అశోక్, హెచ్‌ఎం సిస్టర్ జాయిసి, నెహ్రూ యువక కేంద్రం అధికారులు సుంకర రాము, సీతారామయ్య, పలువురు ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

ఉంగుటూరు: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీలలో ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును పొందారని హెచ్‌ఎం సీహెచ్ అనిత తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడుతూ మచిలీపట్నం స్పందన మీటింగ్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, డీఈవో తాహెరా సుల్తానా చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ శ్రీలత, క్రాంతిలను అభినందించారు.

రేపు సిద్ధార్థ ఆడిటోరియంలో జానపద గీతాలాపన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జానకీరావు బృందంతో జానపద గీతాలాపన కార్యక్రమం జరుగుతుందని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన యువజనోత్సవ పోటీల్లో జానకీరావు బృందం నాలుగు సార్లు ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారందరూ ఉచితంగానే ఈ ప్రదర్శనను తిలకించొచ్చని సూచించారు.

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా ఉదకశాంతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సాయంత్రం ఉదకశాంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ముందు రోజు ఉదకశాంతి నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైదిక సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓ భ్రమరాంబ, ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంగీత గాత్ర కచేరీ

విజయవాడ కల్చరల్: ప్రముఖ శాస్త్రీయ సంగీత కళాకారిణి సీహెచ్ తులసీ విశ్వనాథ్ ఆలపించిన కీర్తనలు అలరించాయి. నీ పాదమే గతి.. నీకేల దయరాదు.. వంటి వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. ప్రసారభారతి, విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో జీ 20 వసుధైక కుటుంబం కార్యక్రమంలో భాగంగా రెండురోజులపాటు నిర్వహించే సంగీత సంధ్య మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థా కళాశాలలో మంగళవారం ప్రారంభమైంది.

తొలుత శాస్త్రీయ సంగీత కచేరీలో తులసీ విశ్వనాథ్ వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. బి.వి.దుర్గాభవాని వయోలిన్‌పై, బి.వి.ఎస్.ప్రసాద్ మృదంగంపై సహకరించారు.

అనంతరం పసుమర్తి హనుమంతరావు బృందం జానపద కళారూపం తొలుబొమ్మలాటను ప్రదర్శించింది. మైరావణ ఇతివృత్తంగా ఈ ప్రదర్శన కొనసాగింది. చివరిగా సినీ సంగీత దర్శకుడు ప్రేమ్‌జీ ఆధ్వర్యంలో లలిత గీతాలాపన వీనులవిందుగా సాగింది. బుధవారం భక్తి సంగీత కార్యక్రమంలో వి.సరస్వతి, శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో మల్లాది సోదరులు పలు గీతాలు, కీర్తనలను ఆలపిస్తారు. కె.వై.వి.ప్రసాద్ బృందం గరగ నృత్యం ప్రదర్శిస్తుంది.



కీర్తనలను ఆలపిస్తున్న తులసీ విశ్వనాథ్



తోలుబొమ్మలాట

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన రాగిపిండి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు అంకిత్‌రెడ్డి అన్నదానానికి విరాళం అందజేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో ప్రజారోగ్యం

కంకిపాడు: దోమల నిర్మూలన చర్యలతో ప్రజారోగ్యం మెరుగు పడుతుందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సంతోష చంద్రిక అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో దోమల నిర్మూలనకు గంబూషియా చేపలను మురుగు నీటి నిల్వ ప్రాంతాల్లో మంగళవారం విడిచిపెట్టారు. ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి చేపలను మురుగునీటిలో విడిచారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష చంద్రిక మాట్లాడుతూ వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. దోమల నిర్మూలన చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నేత లాం సురేష్, హెల్త్ అసిస్టెంట్స్ కెనడీ, గోపాలకృష్ణ, రాచమళ్ల శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.